ఎదురయిన ప్రతిస్టేషనులోనూ ఆగుతూ, అతి మందంగా నడుస్తూ గంటలకొద్దీ, రోజులకొద్దీ మజిలీలుచేసి పుణ్యకాలం గడిచిపోయాక గమ్యస్థానంచేరే గూడ్సుబండిలాగా- ప్రభుత్వ కార్యాలయాలలో ఒక ఫైలుమీద పూర్తిచర్య తీసుకునేలోగా, అది దీర్ఘప్రయాణం చేస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆ ఫైలు ప్రయాణం మార్కోపోలో ప్రపంచ యాత్రంత సుదీర్ఘంగానూ, గలీవర్ యాత్రలంత వింతగానూకూడావుంటుంది. గుమాస్తా బల్లమీద మొదలై సెక్షన్‌అఫీసర్, అండర్ సెక్రటరీ. డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ సెక్రటరీవరకూ చేరుకుని మళ్ళీ అవరోహణ క్రమంలో గుమాస్తా బల్ల చేరేసరికి, అందులోని అవసరం గడిచిపోతుంది. పై లిస్టులోని ప్రతి ఒక్కరూ తమతమ రిమార్కులు వ్రాసి పంపుతారు. తనేదో సరిదిద్దుతున్నాననుకుని ప్రతివాడూ వ్రాసేదంతా తడిసి మోపెడవుతుందే తప్ప, అంతకంటే ఒరిగేదేమీ లేదు.

ఓ ఆఫీసులో పనిచేస్తున్న ఒక స్త్రీ ఉద్యోగి(ని) పెట్టుకున్న లీవ్ అప్లికేషన్‌కు సంబంధించి ఫైలు ఇలా మొదలవుతుందనుకుందాం: లీవ్ లెటర్‌కు తననోటీసు జతచేసి, ఫైలుకు ప్రారంభోత్సవం చేస్తాడు గుమాస్తా.

* * *

కుమారి కాంతాదేవి 9-1-'69 తేదీనుండి మూడు నెలలు మెటర్నిటీ సెలవు కోరుతూ దాఖలుచేసుకున్న అర్జీ ఇందులో పంపబడినది. సెలవు మంజూరు చేయుటకు అవసరమైన డాక్టరు సర్టిఫికేటుకూడా జతచేయబడినది. ఆ సర్టిఫికేట్ ప్రకారం 2-3-'69 తేదీ ప్రాంతంలో కాన్పు జరగవచ్చును.

అఫీసు సెలవు చట్టంప్రకారం కుమారి కాంతాదేవి సదరు సెలవుకు అర్హురాలు.

పై ఉత్తర్వులకోసం నివేదించబడినది.

16-1-'69 గుమాస్తా.

* * * *

కుమారి కాంతాదేవి మెటర్నిటీ సెలవు కోరుతూ 30-12-68 తేదినాడు దాఖలు చేసుకున్న అర్జీ 16-1-'69 తేదీన ఉత్తర్వుల కోసం పంపబడినది. ఈ ఫైలు పంపుటలో గుమాస్తా తీసుకున్న పదిహేను రోజుల ఆలశ్యం మన్నించరానిది.

దేశీయాంగ శాఖ ఇటీవల జారీ చేసిన నియమావళి రీత్యా ఇలాంటి ఆలశ్యానికి తగిన సంజాయిషీ కోరుతూ, క్రమశిక్షణ చర్య తీసుకోవగినది.

పై ఉత్తర్వుల కోసం నివేదించబ నది.

20-1-69 సెక్షన్ అఫీసర్.

* * *

నేను పర్యటనలో ఉండిన కారణం చేత, ఈ ఫైలు త్వరగా చూచేందుకు అవకాశం లేకపోయింది. సెక్షన్ ఆఫీసర్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను.

డిప్యూటీ సెక్రటరీగారి ఉత్తర్వుకోసం పంపబడినది.

11-2-'69 అండర్ సెక్రటరీ.

* * *




గుమాస్తా మీద క్రమశిక్షణ చర్య తీసుకొనేందుకు అండర్ సెక్రటరీకి ఇదివరకే అధికారం ఇవ్వబడినది, ఈ ఫైలు నాకెందుకు పంపబడిందో అర్థం కావడంలేదు. అండర్ సెక్రటరీయే ఈ విషయంలో తగుమైన చర్య తీసుకోవలసింది.

23-2-'69. డిప్యూటీ సెక్రటరీ.

* * *

దేశీయాంగ మంత్రిత్వశాఖ జారీచేసిన నియమావళి గురించి, అందురీత్యా తగిన చర్య తీసుకోవడాన్ని గురించి డిప్యూటీ సెక్రటరీగారి దృష్టికి తీసుకురావడం కోసమే ఈ ఫైలు దాఖలు చేయుట మైనది.

28-2-'69. అండర్ సెక్రటరీ

* * *

చూడడమైనది. అండర్ సెక్రటరీ తగిన ఉత్తర్వులు దాఖలు చేయవలసినది.

1-3-'69 డిప్యూటీ సెక్రటరీ.

* * *

గుమాస్తా చేసిన ఆలశ్యానికి వ్రాత పూర్వకమైన సంజాయిషీ కోరవలసినది.

1-3-69 అండర్ సెక్రటరీ.

* *

గుమాస్తా ఒక వారం రోజులు సెలవులో ఉన్న కారణంచేత, అతను తిరిగి డ్యూటీలో చేరాక సంజాయిషీ కోరబడుతుంది.

2-3-'69 సెక్షన్ అఫీసర్.

* * *

అండర్ సెక్రటరీగారి ఆదేశానుసారం నా సంజాయిషీ ఇందులో జతచేసి పంపబడినది.

10-3-'69 గుమాస్తా

* * *

ఇతర ఫైళ్ళ ఒత్తిడిచేత ఈ ఫైలు దాఖలు చేయుటకు ఆలస్యమైందని గుమాస్తా సంజాయిషీ. సెక్షనులోని గుమాస్తాలందరికి సమంగా పనులెలా అప్పగించబడినవో ఇందులో జతచేయబడిన స్టేట్‌మెంట్ వలన తెలియగలదు. గుమాస్తా ఇచ్చిన సంజాయిషీ సరియైనదిగా కన్పించడంలేదు.

అండర్ సెక్రటరీగారు చూడగలరు.

13-3-'69 సెక్షన్ ఆఫీసర్.

* * *

కుమారి శాంతాదేవి మెటర్నిటీ సెలవు మంజూరును గూర్చి ఈ ఫైలు ఉద్దేశించబడింది. దానిని దాఖలు చేయుటకు జరిగిన ఆలస్యానికి గుమాస్తా సంజాయిషీ. అందుకు తగిన చర్య మొ॥ మరో ఫైలుగా మార్చవలసినది.

మెటర్నిటీ సెలవు కోరిన ఉద్యోగిని కుమారి శాంతాదేవి వివాహం కాని స్త్రీ. మెటర్నిటీ సెలవుకు అర్హురాలా ? అన్న విషయం చూడవలసినది.

గుమాస్తా ఈ విషయం మొదట చూచినట్లులేదు.

16-3-'69 అండర్ సెక్రటరీ.

* * *

మెటర్నిటీ సెలవు మంజూరు గూర్చిన నిబంధన ఈ విధంగా వుంది. "స్త్రీ ఉద్యోగి(ని) మూడు మాసాల మెటర్నిటీ సెలవుకు అర్హురాలు. సెలవు పెట్టిన నాటినుండి తొంభై రోజులు - లేదా-కాన్పు జరిగిన నాటినుండి నలభై ఐదురోజులు [రెండింటిలో ఏది ముందుగా పూర్తవునో అది] మంజూరు చేయవచ్చును."

మెటర్నిటీ సెలవు కోరుతున్న స్త్రీ ఉద్యోగి(ని) తప్పనిసరిగా వివాహిత అయివుండాలని పై నిబంధనలో లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఐనా ఈ విషయంలో న్యాయశాఖవారి సలహా తీసుకోవడం మంచిది.

20-3-69 సెక్షన్ ఆఫీసర్.

* * *

న్యాయశాఖవారిని ఈ విషయంలో తగిన సలహా ఇవ్వవలసినదిగా అర్థించడమైనది.

26-3-69 అండర్ సెక్రటరీ

* * *

అవివాహిత ఐన స్త్రీ ఉద్యోగి (ని) మెటర్నిటీ సెలవు కోరరాదని నిబంధనలో లేదు, సదరు సెలవు కోరిన వ్యక్తి స్త్రీ అయివుంది. మంజూరు చేసే అధికారి సెలవు కారణాల గూర్చి సంతృప్తి పడినట్లయిన సెలవు మంజూరు చేయవచ్చును.

అవివాహితులైన స్త్రీ ఉద్యోగినులు మెటర్నిటీ సెలవు కోరడాన్ని నిషేధించే పక్షంలో, ఇప్పటి నిబంధనలను సవరించవలసివున్నది. ఇది 'పాలసీ'కి సంబంధించిన విషయం కాబట్టి దేశీయాంగ మంత్రిత్వ శాఖను సంప్రదించవలసినది.

12-4-69 న్యాయసలహాదారు.

* * *

సెలవు అర్జీతో జత చేయబడిన డాక్టరు సర్టిఫికేటు ప్రకారం న్యాయసలహాదారు ఉదహరించిన రెండు అంశాలు తృప్తికరంగా వున్నవి.

1. కుమారి శాంతాదేవి స్త్రీ ఉద్యోగి (ని).

2. సర్టిఫికేటులో చెప్పబడిన తారీఖుకు ఇంచుమించుగా కాన్పు జరిగే అవకాశం వుంది.

కాబట్టి కుమారి శాంతాదేవి సెలవు మంజూరుకు అర్హురాలు.

ఈ సందర్భంలో ఒక విషయం వ్రాయవలసి వుంది. కుమారి శాంతాదేవి 1-3-69 తేదీ నాడు మగ శిశువును ప్రసవించినది. సెలవు మంజూరు అవకపూర్వమే ఆవిడ వెళ్ళిపోయింది. అందుచేత నియమావళి ప్రకారం తగిన క్రమశిక్షణ చర్య తీసుకోవలసి వుంది.

ఈ సెలవు మంజూరును గూర్చి తుదిచర్య తీసుకోక ముందే న్యాయ శాఖ వారి సలహా ననుసరించి దేశీయాంగ మంత్రిత్వ శాఖ వారికి తెలుపడం మంచిదిగా తోస్తుంది.

15-4-'69, సెక్షన్ ఆఫీసర్.

* * *

సెక్షన్ ఆఫీసర్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. ఇది 'పాలసీ'కి సంబంధించిన విషయం కాబట్టి, దేశీయాంగ శాఖకు పంపేముందు డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ చూచివంపవలసినది.

18-4-'69. అండర్ సెక్రటరీ.

* * *

నేను ఏకీభవిస్తున్నాను.

22-4-'69 డిప్యూటీ సెక్రటరీ

* * *

ఒక భారతీయ అవివాహిత స్త్రీ మెటర్నిటీ సెలవు కోరడం ఆశ్చర్యంగా వుంది. కుమారి శాంతాదేవిని సంజాయిషీ వివరించ కోరవలసినది.

25-4-'69 జాయింట్ సెక్రటరీ.

* * *

అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌వారు జాయింట్ సెక్రటరీగారి ఉత్తర్వు చూచి, తగిన చర్య తీసుకోవలసినది

28-4-'69 అండర్ సెక్రటరీ.

* * *

కుమారి శాంతాదేవికి 10-6-67 తేదీనాడు వివాహమైంది. ఆఫీసు రికార్డులలో తన పేరును 'శ్రీమతి శాంతాసుమన్'గా మార్చవలసిందిగా ఆవిడ చాలా కాలం క్రితమే అర్జీ దాఖలు చేసుకున్నది. సదరు మార్పును గూర్చి 'గెజెట్ ఆఫ్ ఇండియా'లో ఇంకా ప్రచురింపబడినట్లులేదు. అది త్వరలో జరుగవచ్చును. అంతవరకూ ఆవిడ తన పూర్వపు పేరుతోనే వ్యవహరించబడవలసినది.

8-5-'69 గుమాస్తా (అడ్మినిస్ట్రేషన్ సెక్షన్)

... .............

9-5-'69 సెక్షన్ ఆఫీసర్ ( " )

... .............

10-5-'69 అండర్ సెక్రటరీ ( " )

* * *

అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌వారు వెలిబుచ్చిన అభిప్రాయంరీత్యా 'కుమారి శాంతాదేవి (ప్రస్తుతం శ్రీమతి శాంతా సుమన్) కి సెలవు మంజూరు చేయడంలో ఆక్షేపణ ఏమీ లేదు.

మెటర్నిటీ సెలవు మూడు నెలలు. ఆ తర్వాత ముప్పైరోజుల ఎర్న్‌డ్ లీవు ఉపయోగించుకుని కుమారి శాంతాదేవి 9-5-'69 తేదినాడు డ్యూటీలో చేరినది.

పై పరిస్థితుల దృష్ట్యా "ఏవిధమైన క్రమశిక్షణ చర్య తీసుకొనవలసిన అవసరం లేదు.

డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ చూడగలరు.

13-5-'69 గుమాస్తా.

... ...

15-5-'69 సెక్షన్ ఆఫీసర్.

... ...

17-5-'69 అండర్ సెక్రటరీ.

* * *

చూడడమైనది.

17-5-'69 డిప్యూటీ సెక్రటరీ.

* * *

చూడడమైనది.

18-5-'69 జాయింట్ సెక్రటరీ.

* * *

ఇంతటితో ఈ ఫైలు ముగింపవచ్చును.

20-5-'69 గుమాస్తా.

... ...

21-5-'69 సెక్షన్ ఆఫీసర్.

... ...

22-5-'69 అండర్ సెక్రటరీ.

[శ్రీ 'ఆలాక' గారి ఆంగ్లకథకు అనుసరణ]

## "మెరుపు"

జీవితం
నిమ్నోన్నతాల మయం
మెప్పుకై ప్రాకులాడుచూ
ఎదుటివాని లోపాలు 'బాకా' వూదువాడు
తాత్కాలికంగా పొందును
'బక్షీష్'........

కాల గమనంలో
అది అసంతృప్తి మయమై
అతని 'కాకా - బాకా' నుండి
రాలును 'యాష్' [బూడిద]—

దూరంలో తళుక్కుమన్న
దాని అందం దృగ్గోచరం
వచ్చినవాడి కళ్ళు చెదరజేసి
మిగులును దాని సారం (!)

రచ్చబండ రంగంలో
రాజకీయాలు రంగులు పులుముకున్నాక
వచ్చిని కాపురాలెన్నో
కచ్చ (కక్ష) లతో రాలాయి....

—కొప్పర్తి రామారావు